క్లుప్తంగా

భక్తులతో కిటకిటలాడిన మైసమ్మ ఆలయం



నవాబుపేట: మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవురోజు కావటంతో అమ్మవారికి మొక్కులు తీర్చుకుని.. విందులు ఏర్పాటు చేసుకొనేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు.

చిత్రకారుడికి సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: బాల సాహిత్య గ్రంథం 'పిల్లల పాటల పరిమళం' పుస్తకానికి చిత్రాలు వేసిన జిల్లా చిత్రకారుడు మహేష్‌కుమార్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో సన్మానించారు. శాంతా–వసంతా ట్రస్ట్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ డాక్టర్ కేఐ.వరప్రసాద్‌రెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వన భోజనాలు



మిడ్జిల్: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టుకు, వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. సంఘం నాయకులు సత్యం గుప్తా, విజయ్, యాదగిరి, మూర్తి, సింహయ్య, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

గండేడ్ వాసికి పురస్కారం



గండేడ్: మండల పరిధిలోని రంగారెడ్డిపల్లికి చెందిన రాఘవేంద్రచారికి తెలుగు వెలుగు జాతీయ పురస్కారం లభించింది. జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సాహితీ వేదికగా ఈ పురస్కారాన్ని అందజేశారు. విజయవాడలో ఆదివారం ఆయన పురస్కారం అందుకున్నారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

మహమ్మదాబాద్: విద్యుత్‌షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన చౌదర్‌పల్లి గుంగ్యాతండాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన బాలునాయక్ గేదెను పొలం దగ్గర కట్టేశాడు. కాగా ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో వైర్ల కింద ఉన్న గేదెకు షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ రూ. 80 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ఘనంగా వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో ఆదివారం మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నటి వేమిరెడ్డి దీపిక, పారిశ్రామిక వేత్త మద్ది అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈనెల 20 వరకు మొదటి వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు స్టోర్‌హెడ్ శరత్ తెలిపారు. స్టోర్ మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి భాగ్యం కల్పించండి



మహిళా ప్రయాణికులతో కిటకిటలాడుతున్న జడ్చర్ల బస్టాండ్

- గ్రామీణ ప్రాంతాలకు బస్సుసౌకర్యం ఏర్పాటుచేసి లబ్ధి చేకూర్చాలంటున్న మహిళలు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభం కావటంతో మహిళల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. ఈ నేపథ్యంలోనే తమ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించి.. తమకు మహాలక్ష్మి భాగ్యం కలిపించి లబ్ధి చేకూర్చాలని నియోజకవర్గంలోని ఆయా గ్రామాల మహిళలు అభిప్రాయ పడుతున్నారు. ఎలాంటి చార్జ్ లేకుండా బస్సు ప్రయాణం చేయవచ్చని సంతోష పడుతున్నప్పటికీ.. తమ గ్రామాలకు సౌకర్యం లేదని ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. నియోజకవర్గంలోని జడ్చర్ల, రాజాపూర్, బాలానగర్ మండలాల్లో ఏ ఒక్క గ్రామానికి కూడా పల్లె వెలుగు బస్సు సౌకర్యం లేదని, ఇన్ని రోజులుగా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రయాణాలు చేస్తున్నామని చెబుతున్నారు.

గతంలోని రూట్‌లు ఇలా..

జడ్చర్ల పరిధిలోని ఎక్వాయపల్లి, చిన్న ఆదిరాల మండల కేంద్రానికి 25 కి.మీ దూరంలో ఉన్నాయి. ఈ మార్గంలో కోడ్గల్, కొండేడ్, లింగంపేట గ్రామాలతోపాటు పది తండాలున్నాయి. ఎక్వాయపల్లి మీదుగా కల్వకుర్తి నియోజకవర్గంలోని తొమ్మిదిరేకుల, కేశంపేట వెళ్లవచ్చు. గతంలో బాదేపల్లి బస్టాండ్ నుంచి ఈ మార్గంలో కేశంపేట వరకు బస్సులు నడిచేవి, అలాగే బండమీదిపల్లి, వల్లూరు, ఉదండాపూర్, తీగలపల్లి మీదుగా నవాబుపేట మండలం కాకర్లపాడు, పర్వతాపూర్ మైసమ్మ, మహబూబ్‌నగర్ చేరుకునేలా బస్సు సౌకర్యం ఉండేది. అదేవిధంగా బాదేపల్లి బస్టాండ్ నుంచి ఆలూరు మీదుగా మొల్గరకు, అక్కడి నుంచి తిరిగి ఆలూరు నుంచి హైదరాబాద్ వరకు బస్సులు నడిచేవి. ఉమ్మడి బాలనగర్ మండలంలోనూ అనేక గ్రామాలను కలుపుతూ కేశంపేట, నవాబుపేట, ఫరూక్‌నగర్ మండలాలకు బస్సు సౌకర్యం ఉండేది. నవాబుపేట మండలంలో ఫరూఖ్‌నగర్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, వికారాబాద్ ప్రాంతాలకు గ్రామాల నుంచి బస్సు సౌకర్యం ఉండేది. కాగా దశాబ్దకాలంగా ఆయా ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేకుండా పోవటంతో ప్రజలు ప్రైవేట్‌వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి రావటంతో తమ గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు వేయాలని మహిళలు కోరుతున్నారు. తద్వారా తమతో పాటు విద్య, ఉద్యోగం, వ్యాపారంతోపాటు ఇతర పనులపై వెళ్లే వారికీ ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెబుతున్నారు. అదేవిధంగా మల్లెబోయిన్‌పల్లి 167, 44వ నంబరు జాతీయరహదారులకు సమీపంలోనే ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేదు. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ నుంచి భూత్పూర్ వెళ్లే మినీబస్సులు తమ గ్రామం మీదుగా వెళ్లేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా బాదేపల్లి బస్టాండ్ నుంచి షాద్‌నగర్ బస్సులు నడిపించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బస్సు సౌకర్యంతో ప్రయోజనం



ప్రభుత్వం బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభించటం బాగుంది. అయితే మేం బస్సు ఎక్కాలంటే జడ్చర్లకు పోవాల్సిందే. ఇంతకు ముందు బాదేపల్లి నుంచి కేశంపేట వరకు బస్సులు నడిపించేవారు. పదేళ్లుగా పూర్తిగా ఆపేశారు. ఉచిత ప్రయాణం ప్రారంభించినందుకు పల్లెటూళ్లకు బస్సులు వేస్తే మాకు లాభం చేకూరుతుంది. ఈ మేరకు చర్యలు చేపట్టాలి –రాములమ్మ, పెద్ద ఆదిరాల

పునరుద్ధరించండి



మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఇంతకుముందు మా ఉదండాపూర్ మీదుగా బాదేపల్లి–మహబూబ్‌నగర్ బస్సులు నడిచేవి. కానీ చాలా రోజులుగా బంద్ చేశారు. పునరుద్ధరిస్తే మా లాంటి వారికి మేలు కలుగుతుంది.

–అంజమ్మ, ఉదండాపూర్

అహంకారానికి గుణపాఠం



మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అహంకారానికి ప్రజలు గత ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. జిల్లా కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ కొత్త ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. చెరువులు, కుంటల భూములను కబ్జా చేసి బీఆర్‌ఎస్ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారని.. వాటిపై విచారణ చేపట్టి ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. మాజీ మంత్రుల పేషీల్లో మాయమవుతున్న ఫైళ్ల విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండురోజులు గడువక ముందే మాజీ మంత్రి హరీష్‌రావు రైతుబంధుపై మాట్లాడటం సిగ్గు చేటన్నారు. జిల్లా కార్యదర్శి బాలకిషన్, నాయకులు డి.రాము, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు రాజు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, రమేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

శివాంజనేయ ఉత్సవాలు ప్రారంభం



నార్లోనికుంట్లలో శివరామకోటి యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

దేవరకద్ర: నార్లోనికుంట్లలో ఆదివారం ఘనంగా శివాంజనేయ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పతాకావిష్కరణ, అఖండ దీపారాధన, స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శివరామకోటి జపయజ్ఞ గీతాజ్ఞాన యజ్ఞము ఘనంగా నిర్వహించారు.

నేడు సామూహిక గీతాహవనము

ఆలయంలో సోమవారం సామూహిక గీతాహవనము, ఆధ్యాత్మిక ఉపన్యాసములు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మంగళవారం రాత్రి అఖండ భజన తెల్లవారు జామున స్వామివారి రథోత్సవం నిర్వహించడానికి దేవస్థాన కమిటీ వారు ఏర్పాట్లను చేశారు.

క్యాంపు కార్యాలయంలో పూజలు



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం వేద పండితులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఏ సమస్య వచ్చినా ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు సూచించారు. అదేవిధంగా ఎమ్మెల్యేను వివిధ మండలాల నాయకులు ఘనంగా సన్మానించారు. మార్కెట్ మాజీ చైర్మన్ అరవింద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. పేదలకు వరం రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం అని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

గుడ్ మార్నింగ్ దేవరకద్ర....

నియోజకవర్గంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోడానికి ప్రతి వారం నాలుగు రోజుల పాటు గుడ్ మార్నింగ్ దేవరకద్ర పేరుతో ఏదో ఒక గ్రామాన్ని సందర్శించి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరిస్తామని పెద్ద సమస్యలు ఉంటే సీఎం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

నేడు రివ్యూ సమావేశం...

క్యాంపు కార్యాలయంలో సోమవారం అన్ని శాఖలకు సంబంధించి రివ్యూ సమావేశాలు జరుగుతాయని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. నీటి విడుదల విషయంలో అధికారులతో మాట్లాడుతామని కోయిల్‌సాగర్, సరళా సాగర్ నీటి లభ్యతను బట్టి యాసంగి పంటలకు నీటిని వదిలే విషయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఆరోగ్య శ్రీ సేవలు బలోపేతం చేస్తాం



ఆరోగ్య శ్రీ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

పాలమూరు: రాజీవ్ ఆరోగ్య శ్రీద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య ఖర్చులను రూ.ఐదు లక్షల నుంచి రూ. పది లక్షలకు పెంచడంతో పాటు ఈ సేవలను అమలు చేయడం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఆదివారం పోస్టర్లు ఆవిష్కరించారు. జనరల్ ఆస్పత్రి గతంలో 150 పడకల నుంచి 750 పడకల వరకు రూపాంతరం చెందిందని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మూడు నెలలకు ఓసారి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చేందుకు తాము కృషి చేస్తామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందన్నారు. డీఎంహెచ్‌ఓ కృష్ణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవన్, అర్థో హెచ్‌ఓడీ రామకిషన్, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ స్వప్న, ఆర్‌డీఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని ఎంబీ చర్చి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి శాలువాలతో సన్మానించారు. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. ఎంబీ చర్చి చైర్మన్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్, వైస్ చైర్మన్ బీఐ జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, కోశాధికారి స్టీవెన్, టైటస్‌పాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మోతీనగర్‌లోని బెథస్థ చర్చి వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

హన్వాడ: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం మండల పరిధిలో ఓ కార్యక్రమానికి వచ్చిన ఆయనను వారు కలిశారు. జిల్లా ఐఎస్‌టీయూ ఉపాధ్యక్షుడు శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం

హన్వాడ: ప్రభుత్వం ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించడంతో సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు వేపూర్‌లో ఆదివారం మహిళలు పాలాభిషేకం చేశారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10లక్షల వరకు పెంచి 'చేయూత' నివ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎంతో పాటు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మహిళా నాయకులు మౌనిక, అంజిలమ్మ, పద్మమ్మ, గుండమ్మ, వెంకటమ్మ, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టింపేలేదు



నవాబుపేట యన్మన్‌గండ్ల మలుపులు



చిక్కుడు వాగు సమీపంలో..



మైసమ్మ అడవి ప్రాంతంలో ..

- ప్రమాదకర మలుపులతో నవాబుపేట– మహబూబ్‌నగర్ రోడ్డు
- ఎక్కడా కానరాని సూచికబోర్డులు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న పాలకులు, అధికారులు

నవాబుపేట: మహబూబ్‌నగర్– నవాబ్‌పేట్ రోడ్డు ప్రమాదకర మలుపులతో ప్రయాణికుల్లో గుబులు పుట్టిస్తోంది. నల్లమల్ల ఘాట్‌రోడ్డును గుర్తుకు తెచ్చే ఈ దారిలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అడుగడుగునా మలుపులతో పాటు, మరమ్మతుకు గురైన కల్వర్టులతో ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ దారిపై ప్రాణాలు అరచేత పెట్టుకుని ప్రయాణం చేయాల్సిందని ఆయా గ్రామాల వారు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డుపై కొత్తగా ప్రయాణించేవారు అవగాహన లోపంతో ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయని చెబుతున్నారు. ఇటీవల రుద్రారం గ్రామానికి వచ్చిన ఓ వ్యక్తి రాత్రి సమయంలో కల్వర్టు దగ్గర ఎలాంటి సూచికలు లేకపోవడంతో గుర్తించక అందులో పడి మృతిచెందిన ఘటననే ఉదాహరణ అని అంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఉన్నప్పటికీ పాలకులకు, అధికారులకు ఎలాంటి పట్టింపు లేకుండా పోయింది. కనీసం సూచిక బోర్డులు, వేగనిరోధకాలు వంటివి ఎక్కడా ఏర్పాటు చేయలేదు. గతంలో సింగిల్ రోడ్డుగా ఉన్నప్పుడైతే రోజుకో ప్రమాదం జరిగేది. ప్రస్తుతం డబుల్ రోడ్డుగా మార్చాక ఈ తీవ్రత కొంత తగ్గినప్పటికీ.. మలుపుల వద్ద వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రమాదాల స్థలంలోనే సిగ్నల్ బోర్డులు ఏర్పాటు చేయడం మరిచారని పలువురు ఆరోపిస్తున్నారు. నవాబుపేట నుంచి యన్మన్‌గండ్ల మలుపు, గద్దగుండు మలుపు, రుద్రారం, కాకర్లపహడ్ మలుపు, పర్వతాపూర్ మైసమ్మ అడవి ప్రాంతం, చిక్కుడు వాగు వద్ద మలుపులు చాలా ప్రమాదకరంగా ఉన్నాయని ఇప్పటికైనా సూచికబోర్డులు, వేగనియంత్రకాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి

రుద్రారం కల్వర్టు దగ్గర తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. దగ్గరకు వచ్చాకగానీ సమస్య ఉందని గుర్తించడానికి ఆస్కారం లేదు. కొత్త వారైతే కచ్చితంగా ప్రమాదం బారిన పడతారు. రోడ్డు వెంట ఎలాంటి సూచికలు లేవు, కల్వర్టు రక్షణ గోడలు సైతం లేవు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– సతీష్‌చంద్ర, నవాబుపేట

ఉన్నతాధికారులకు వివరిస్తాం

మహబూబ్‌నగర్– నవాబుపేట రోడ్డులో ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయి. మైసమ్మ దేవాలయం ప్రాంతంలో అడవిలో అతివేగంగా వాహనాలు వెళ్తుడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు వేసిన కొత్తలో 5 కొన్ని చోట్ల సిగ్నల్స్ ఏర్పాటు చేశాం. మరమ్మతు చేయించడంతో పాటు సమస్యలపై ఉన్నతాధికారులకు వివరిస్తాం. –రాములు , ఇన్‌చార్జ్ ఎఈ

మున్సిపల్ పాలక మండలిలో లొల్లి షురూ!

జడ్చర్ల: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఓటమి తరువాత అందుకు కారణాలను నాయకులు విశ్లేషించుకుంటున్నారు. మున్సిపల్ పాలకమండలిలో చోటు చేసుకున్న పరిణామాల వల్లే బీఆర్‌ఎస్‌కు ఓటింగ్ శాతం తగ్గిందన్న చర్చోపచర్చలు సాగుతున్నాయి. మండలిపై అసంతృప్తి ఎన్నికల్లో ప్రభావం చూపిందని నాయకులు అంచనా వేస్తున్నారు. పాలక మండలిలో మొదటి నుంచి అవినీతి, అక్రమాలకు సంబంధించి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అవే తమ సారు కొంప ముంచాయని కార్యకర్తలు అంటున్నారు. ఎవరో కొందరి వల్ల మొత్తం పాలక మండలిపైనే మచ్చ ఏర్పడిందని, అవినీతి మరకలను తాము తొలగించుకోవాలని సభ్యులు నిర్ణయించి గుట్టుగా ఓ కౌన్సిలర్ ఇంటిలో శనివారం సమావేశమయ్యారు.

అంతా ఆయనే..?:

కాగా మండలి సభ్యులంతా మూకుమ్మడిగా చైర్‌పర్సన్ భర్తే ఇందుకు కారణమంటూ ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. ఆక్రమణలు, అవినీతిలో ఆయన పాత్రే ప్రధానంగా ఉందని, ఆయనతో పాటు కొందరు కౌన్సిలర్లు కూడబలుక్కొని చేసిన వ్యవహారాలకు తమను బాధ్యులు చేయడం ఏమిటని పలువురు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. తాము నిజాయితీగా సేవలు అందిస్తున్నా.. అందరినీ ఒకే గాటాన కట్టి మాట్లాడుతుంటే తట్టుకోలేకపోతున్నామని పలువురు బాధపడినట్లు తెలుస్తోంది. కాగా విషయం తెలుసుకుని సమావేశానికి వచ్చిన చైర్‌పర్సన్ భర్తను కౌన్సిలర్లు వెనక్కి తిప్పి పంపినట్లు సమాచారం. చైర్ పర్సన్‌ను మారిస్తేనే అవినీతి మరకలు తొలగుతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారని.. విషయాన్ని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆయన నిర్ణయం మేరకు వ్యవహరించాలని అనుకుంటున్నారని వినవస్తోంది. ఇదిలా ఉంటే సమావేశంలో తామంతా కలిసికట్టుగా ఉండి, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో పాటు ప్రజలకు సేవలందించే విధంగా చర్చించామని, అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని చైర్ పర్సన్ భర్త రవీందర్ తెలిపారు. ఈ నేపథ్యంలో విషయం ఎటు దారితీస్తుందో వేచి చూడాల్సి ఉంది.



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

సకల జనుల సంక్షేమమే ధ్యేయం

రాజాపూర్: అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసి మొదటిసారిగా ఆదివారం మండలానికి విచ్చేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి నాయకులు ఆదివారం ఘనంగా గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా సొంతగ్రామం రంగారెడ్డిగూడలోని లక్ష్మీనారాయణస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మొక్కులు తీర్చుకున్నారు. నాయకులు నరహరి, లక్ష్మీనారాయణగౌడ్, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: నియోజవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు.. సకల జనుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి వచ్చిన ఆయనకు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన నివాళి అర్పించారు. అనంతరం పెద్దాయపల్లి శివారులోని అయ్యప్ప ఆలయానికి వెళ్లారు. అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పార్టీ అధ్యక్షుడు శంకర్ నాయక్, పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం జడ్చర్ల బస్టాండ్‌లో ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఆవిష్కరించారు. మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్ఎం శ్రీదేవి, డీఎం సుజాతల పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యేగా తొలిసారి జడ్చర్లకు అనిరుధ్ రెడ్డికి నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. అంతకుముందు ఆయన పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కొళ్ళగుట్ట దర్గాలో ప్రార్థనలు చేశారు.

జడ్చర్ల: జనరంజకమైన పాలనను అందించి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వంద పడకల ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ. 10 లక్షల ఉచిత వైద్య సేవలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. గత పాలకులు ఆస్పత్రిని హడావుడిగా ప్రారంభించారని.. ఇక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాగా ఆస్పత్రికి ప్రధాన రహదారి నుంచి నేరుగా వచ్చే విధంగా రోడ్డును ఏర్పాటు చేయాలని, అంబులెన్స్ రావడానికి ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యేను, అదనపు కలెక్టర్ మోహన్‌రావును సూపరింటెండెంట్ సోమశేఖర్ కోరారు. దీంతో వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి అమలు చేయాలని ఎమ్మెల్యే అన్నారు. ఆస్పత్రి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కూడా స్వాధీనం చేసుకోవాలని సూచించారు. వైద్య శాఖ అధికారి కృష్ణ, డాక్టర్లు శ్రీధర్‌రెడ్డి, శివకాంత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాజాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 1997– 98 లో పదోతరగతి చదివిన వారు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువులను ఆహ్వానించి సత్కరించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఉచిత వైద్య శిబిరం



మిడ్జిల్: మండల కేంద్రంలో ఆదివారం షారోన్ యోబు, మెమోరియల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 400 మందికి వైద్య పరీక్షలు చేయించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించినట్లు నిర్వాహకులు రాజరత్నం తెలిపారు. ఎంపీపీ సుదర్శన్, ఎంపీటీసీ గౌస్, నాయకులు వెంకట్ రెడ్డి, గోపాల్, వైద్యులు పాల్గొన్నారు.